ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 15 సెప్టెంబరు 2024

ఇన్నోవేషన్ హబ్‌కు స్థల పరిశీలన

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 14 : ఇన్నోవేషన్ హబ్ నిర్మాణానికి గాను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ స్థల పరిశీలన చేశారు. సర్వే నెంబరు 249/1లో 1.34 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు ఆర్డీవో కె.హేమలత తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ హబ్ నిర్మాణానికి ఈ స్థలం అనువుగా ఉందన్నారు. విద్యార్థుల కోసం ప్రయోగశాల ఏర్పాటుతో పాటు చుట్టూ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఉప తహసీల్దార్ టి.వెంకటరమణ, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ డి.గౌరునాయుడు తదితరులు ఉన్నారు.



సున్నపుగెడ్డ వాటర్ ఫాల్స్

పర్యాటకానికి పెద్దపీట

- జిల్లాలో సందర్శనీయ ప్రదేశాలపై ప్రభుత్వం దృష్టి
- తొలివిడతగా సున్నపుగెడ్డ అభివృద్ధికి నిధుల మంజూరు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన గత వైసీపీ సర్కారు
- కూటమి సర్కారు చర్యలపై జిల్లావాసుల హర్షం

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలకు నిలయం.. పార్వతీపురం మన్యం. జిల్లాలో పర్యాటక ప్రాంతాలెన్నో ఉన్నాయి. ఎత్తయిన గిరులు.. జలాశయాలు.. జలపాతాలు.. ఆహ్లాదకర, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కొదవే లేదు. అయితే జిల్లాలో పర్యాటకాన్ని గత వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసింది. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు కోరలేదు.. మౌలిక వసతులకు నిధులు కూడా మంజూరు చేయ లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జిల్లా పర్యాటకంపై దృష్టి సారించింది. తొలివిడతలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి లభించ నుంది. సందర్శకుల తాకిడి పెరగనుంది. మరోవైపు 'మన్యం' ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. మొత్తంగా జిల్లా పర్యా టకాభివృద్ధికి అడుగులు పడ డంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'మన్యం' లో నాలుగు నియోజకవర్గాల్లో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల కోసం ఇప్పుడు తెలుసుకుందాం..

పార్వతీపురం నియోజకవర్గంలో...

పార్వతీపురం నియోజకవర్గంలో అడ్డాపుశీల ప్రాంతం పర్యాటకానికి ఎంతో అనుకూలం. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. గరుగుబిల్లి మండలం తోటపల్లి దేవస్థానాన్ని కూడా మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. రెండో తిరుపతిగా పేరొందిన తోటపల్లి దేవస్థానం, దానికి సమీపం లోని నాగావళి తీరం, ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి రమ ణీయ దృశ్యాలు భక్తులు, సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుం టున్నాయి. ఈ దేవస్థానంతో పాటు తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు వద్ద బోటు షికారు, ఐటీడీఏ పార్కును సుందరీకరిస్తే.. మరింతగా సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

సాలూరులో...

సాలూరు నియోజకవర్గంలో కురుకూటి, దండిగాం జలపాతాలు, పాచిపెంట మండలంలో పారమ్మ కొండ పర్యాటకులతో నిత్యం కిటకిటలాడుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేయాల్సి ఉంది. అదేవిధంగా పాచిపెంట నుంచి అరకు రహదారి నిర్మాణం పూర్తయితే.. జిల్లాకు పర్యాటకుల తాకిడి పెరగనుంది.

కురుపాంలో...

కురుపాం నియోజకవర్గంలో తాడికొండ వాటర్ ఫాల్స్, ఎస్‌కేపాడు నర్సరీ, జరగడ వద్ద హిల్ స్టేషన్ తదితర వాటిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. గతంలో ఎస్‌కే పాడు వద్ద సుమారు రూ. ఏడు కోట్లతో పద్మ వ్యూహం, బోటు షికారు, యోగ శిక్షణ, ట్రైబల్ కల్చర్ సెంటర్ ఏర్పాటుపై పనులు ప్రారంభించారు. గానీ వివిధ కారణాలతో అర్ధాంతరంగా ఆయా పనులను నిలిచి పోయాయి. టూరిజం శాఖ ఆయా ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పర్యాటకుల వసతి సదుపాయానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇక కొమరాడ మండలంలో జంఝావతి ప్రాజెక్టు అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలి. అదేవిధంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాల్సి ఉంది.

పాలకొండలో...

పాలకొండ నియోజకవర్గంలో సీతంపేట మండలం దోనుబాయి సమీపంలో సున్నపుగెడ్డ జలపాతం అభి వృద్ధికి ఇటీవల కూటమి ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. దీంతో పనులు చేపట్టేందుకు అధి కారులు సన్నద్ధమవుతున్నారు. కాగా ఇదే మండలంలో మల్లి గ్రామ సమీపంలోని మల్లమ్మతల్లి, తొత్తడి సమీపంలో సందమ్మ జలపాతాలపై టూరిజం శాఖ దృష్టి సారించాల్సి ఉంది. సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో సదుపాయాలను మెరుగుపర్చాలి. జగతపల్లి వ్యూపాయింట్ వద్ద కాటేజ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది.



గుమ్మలక్ష్మీపురం ఐటీడీఏ పార్కు



- బదిలీలకు మళ్లీ గడువు పెంపు
- 22లోపు ప్రక్రియ పూర్తికి ఆదేశాలు జారీ
- అప్పుడే కొందరు ఉద్యోగుల పైరవీలు

ముచ్చటగా మూడోసారి

పార్వతీపురం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి గడువు పెంచింది. ఈ నెల 22లోపు ప్రక్రియ పూర్తి చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ సారైనా బదిలీల ప్రక్రియ ముగుస్తుందా లేదా అన్న సందేహం ఉద్యోగుల్లో నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల 31లోగా బదిలీలు చేపట్టాలని ఆదేశాలిచ్చింది. అయితే మరికొంత గడువు కావాలని పలు జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతి పాదనలు వెళ్లాయి. దీంతో ఈ నెల 15 వరకు సమయం ఇచ్చారు. మరోవైపు భారీ వర్షాలు, వరదలు, వరుస సెలవుల నేపథ్యంలో బదిలీల ప్రక్రియను మరో వారం రోజుల పాటు ప్రభుత్వం పొడిగించింది. దీనిపై ఉద్యోగులు, అధికారుల్లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కాగా జిల్లాలో పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

50 శాఖల్లో పది మంది తప్ప..

జిల్లా ఏర్పడిన తర్వాత రాయలసీమ తదితర ప్రాంతాల నుంచి కొంతమంది అధికారులు బదిలీపై పార్వతీపురానికి వచ్చారు. మరికొంతమంది పదోన్నతులపై ఇక్కడకు వచ్చారు. మొత్తంగా జిల్లాలో పనిచేస్తున్న అధికారుల్లో అత్యధికులు ఇతర జిల్లాల వారే. స్థానికంగా అద్దె భవనాల్లో నివ సిస్తున్న చాలా మంది తమ కుటుంబాలను ఇక్కడికి తీసుకురాలేదు. ఉద్యోగరీత్యా మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. అయితే ఇటువంటి వారంతా తమ సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సుమారు 50 శాఖల్లో ఒక పదిమంది తప్ప మిగిలిన అధికారులంతా.. స్థానచలనం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొంతమంది వారి సొంత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను కలుసుకుని.. బదిలీల ప్రయత్నాన్ని ముమ్మరం చేస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాల్సి ఉంది. కాగా ఇదే సమయంలో కొంత మంది అధికారులు తమ శాఖలపై దృష్టి పెట్టడం లేదు.

కొనసాగుతున్న ప్రయత్నాలు

నిబంధనల ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారికి బదిలీలు తప్పనిసరి. కానీ జిల్లాలో చాలామంది అధికారుల సర్వీసు రెండేళ్లకు మించి లేదు. అయినప్పటికీ సొంత ప్రాంతాలకు వెళ్లాలనే ఆశతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ముమ్మరంగా పైరవీలు చేస్తున్నారు. కొంతమంది తహసీల్దార్లు, వీఆర్‌వోలతో పాటు పలు శాఖలకు చెందిన సిబ్బంది, అధికారులు ఇప్పడిదే పనిలో ఉన్నారు. ఇంకొంతమంది సిఫారసు లేఖలు కూడా సమర్పించారు.

కొత్తవారిని నియమించినా..

పార్వతీపురం, పాలకొండ ఆర్డీవోలను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసింది. వారి స్థానంలో సబ్ కలెక్టర్లుగా ఐఏఎస్ అధికారులను నియమించింది. కానీ బదిలీలైన ఆర్డీవోల పోస్టింగ్‌లపై నేటివరకు ఆదేశాలు రాలేదు. ఇప్పటికే పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి విధుల్లో చేరారు. ప్రస్తుతం ఆయన సీతంపేట ఐటీడీఏకు ఇన్‌చార్జి పీవోగా వ్యవహరిస్తున్నారు. పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా శ్రీవాత్సవ్‌ను నియమించినా.. ఇంకా విధుల్లో చేరకపోవడంతో ఆర్డీవోగా హేమలత కొనసాగుతున్నారు. మొత్తంగా ఈ బదిలీల ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో.. పాలన ఎప్పుడు గాడిలో పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.. బదిలీలపై ఇక్కడకు వచ్చిన ఉద్యోగులు, అధికారులకు జిల్లాపై , వారి శాఖలపై అవగాహన తెచ్చుకునేందుకు కనీసం నెల రోజులు పడుతుంది. ఈ లోపుగా పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున... ప్రభుత్వం బదిలీల ప్రక్రియను వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ప్రతిష్ఠాత్మకంగా

సిరిమాను సంబరం



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 14: అమ్మవారి సిరిమాను సంబరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, హాజరయ్యే వారందరికీ చక్కని అతిథ్యం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో కలెక్టర్ అంబేడ్కర్ అధ్యక్షతన పైడిమాంబ పండగ, విజయనగరం ఉత్సవాలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో పండగను, విజయ నగరం ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ఆలయం వద్ద ఏర్పాట్లను పైడిమాంబ దేవస్థానం చూడాలని, తాగునీరు, విద్యుత్ దీపాలంకరణ పనులను నగర పాలక సంస్థ నిర్వహించాలన్నారు. రహదారులు, బార్ కేడింగ్ బాధ్యతలను ఆర్అండ్‌బీకి అప్పగించామన్నారు. ఉత్సవాల ప్రచార బాధ్యతను సమాచార, పౌర సంబంధాలశాఖకు, సిరిమాను తరలించడం, రూపొందించే బాధ్యతలను అటవీశాఖకు, రవాణా ఏర్పాట్లను ఆర్టీసీ, ప్రాంతీయ ఉప కమిషనర్‌కు అప్పగించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. విజయనగరం ప్రతిష్ఠను చాటిచెప్పేలా పైడిమాంబ గొప్ప తనంపై డాక్యుమెంటరీ రూపొందిస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్ర బాబుని కూడా ఆహ్వానించామన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో

647 కేసుల పరిష్కారం

బెలగాం, సెప్టెంబరు 14: రాజీ మార్గమే ఉత్తమమని జిల్లా న్యాయాధికారి జె.సౌమ్య జోస్పిన్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 647 కేసులు పరిష్కరించారు. వాటిల్లో సివిల్ ప్రోనోట్ కేసులు 6, చెక్ బౌన్స్ 3, అమలు పిటిషన్ 1, టీఎస్ఎన్ ప్రీ లిటిగేషన్ 17, మెయింటినెన్స్ 1, క్రిమినల్ 145, సమ్మరీ ట్రయిల్ 474 కేసులు ఉన్నాయి. పెండింగ్ కేసుల్లో సత్వర పరిష్కారానికి రాజీ మార్గమే మేలని న్యాయాధికారి తెలిపారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయని చెప్పారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏపీపీ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

15 గంటలు.. నరకం

- అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడిన లారీ
- స్తంభించిన ట్రాఫిక్.. నిలిచిపోయిన భారీ వాహనాలు



ఎక్స్‌కవేటర్‌తో భారీ లారీని పక్కకు తొలగిస్తున్న దృశ్యం

కొమరాడ / జియ్యమ్మవలస, సెప్టెంబరు 14 : పార్వతీపురం-కూనేరు అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతులు వాహన చోదకులకు భయంగొల్పుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణం వారికి నరకప్రాయంగా మారింది. తరచూ గోతుల్లో వాహనాలు దిగబడుతుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోతుండగా.. ప్రయాణి కులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు కీలకమైన ఈ రోడ్డుపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో దారి పొడవునా భారీ గోతులతో రహదారి మరింత అధ్వానంగా మారింది. ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. తాజాగా శుక్రవారం సాయంత్రం రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఓ లారీ గుమడ గ్రామం వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడింది. దీంతో భారీ వాహనాలు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని తొలగించగా.. సుమారు రెండు గంటల తర్వాత రాకపోకలు సాగాయి. కాగా అర్ధరాత్రి సమయంలో మరో లారీ గోతిలో దిగబడింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు బారులు తీరగా.. సుమారు 15 గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు కోటిపాం నుంచి ఖేర్జల మీదుగా కొమరాడ చేరుకున్నాయి. మిగతా వాహనాలు మాత్రం అక్కడే ఉండిపోయాయి. శనివారం సాయంత్రం యంత్రం సాయంతో లారీని పక్కకు తొలగించారు. దీంతో యథావిధిగా రాకపోకలు సాగగా.. వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



బారులుదీరిన భారీ వాహనాలు



గోతిలో కూరుకుపోయిన లారీ చక్రాలు

ఆ హోర్డింగ్‌లకు బ్రేక్

- ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేయకుండా చర్యలు
- హైకోర్టు ఆదేశాలతో అధికారుల్లో కదలిక

బొబ్బిలి, సెప్టెంబరు 14: ఎక్కడపడితే అక్కడ, రహదారులకు ఇరువైపులా విచక్షణా రహితంగా పెడుతున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలకు ఇక బ్రేక్ పడనుంది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం కలుగజేసుకొని ఇందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది. అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన అధినేతల దగ్గర నుంచి కిందిస్థాయి చోటా మోటా నాయకుల బర్త్‌డేలకు, వారి విదేశీ ప్రయాణాలకు, సభలు, సమావేశాలకు, విద్యుత్ స్తంభాలకు, ఇతర పబ్లిక్ ఆస్తులపైనా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం సర్వసాధారణమైపోయింది.



రాజకీయ నాయకులవే కాకుండా పేరు బడ్డ విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్ తదితర వాటి ప్రచారానికి కూడా పెద్దసంఖ్యలో నిషేధిత ప్రాంతాల్లో సైతం హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను పెట్టి జనం సహనానికి పరీక్ష పెడుతున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీలు, నగరపాలకసంస్థలు, గ్రామ పంచాయతీల అనుమతితో వీటిని ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు నిర్దేశిత రుసుమును చెల్లించాల్సి ఉన్నప్పటికీ అలాంటివి జరుగుతున్న దాఖలాల్లేవు. ఏదో నామమాత్రంగా ఒకటి రెండింటికి డబ్బులు చెల్లించి మిగిలిన వాటిని అనధికారికంగా, ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. అతి పెద్దసైజులో ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ప్రతికూల వాతావరణం సమయాల్లో ఈ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు కూలిపోతున్నాయి. దీంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తుండడంతో వీటికి సంబంధించిన వ్యక్తులు చెలరేగిపోతున్నారు. ఈ సమస్య చాలాకాలం నుంచి ఉన్నప్పటికీ ఏదో మొక్కుబడిగా అప్పుడప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. పరిస్థితిని గమనించిన కోర్టు నియంత్రణకు సూచనలు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లకు సంబంధించిన సమగ్ర సమాచారం అందజేయాలని, అధికారికంగా ఎన్ని ఉన్నాయి? అనధికారికంగా ఎన్ని ఉన్నాయి? తీసుకున్న చర్యలేమిటి? అనే అంశాలను అందజేయాలని కోర్టు ఆదేశించడంతో అధికారులు పరుగులు తీస్తున్నారు. కోర్టు ఆదేశాలతోనైనా ఈ సమస్యకు చెక్ పెట్టినట్లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



దిక్సూచి DIKSUCHI

మహిళలకు హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్

మంగళగిరి(ఏపీ)లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం 'మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహిళలు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు ఎంపీహెచ్‌డబ్ల్యు సంస్థల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూపు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

వయసు: డిసెంబరు 31 నాటికి 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: మొత్తం సీట్లలో 60 శాతం 'ఫ్రీ సీట్లు' ఉన్నాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్ సీట్లు. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఫ్రీ సీట్లు భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకొన్న ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించాలి. వీటిని సెలెక్షన్ కమిటీకి పంపుతారు. కమిటీ ఆమోదించిన అభ్యర్థులకు ప్రవేశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.50
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21
- **వెబ్‌సైట్:** cfw.ap.nic.in

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.



క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్ ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

- డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్ లిస్ట్స్, ఫంక్షన్స్ కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో ఛార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్ ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ డిప్లొమా



శ్రీకాకుళం(ఏపీ)లోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(డాబీఆర్ఏయూ)- పీజీ డిప్లొమా ఇన్ గాంధియాన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా క్యాంపస్ తరగతులు, ఫీల్డ్ వర్క్ ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక, న్యాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సు ఉపకరంగా ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారు ఎన్జీఓ సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణాభివృద్ధి సంస్థలు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుంది.

ముఖ్య సమాచారం
- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** www.drbrau.edu.in

నవ్య | చిత్రజ్యోతి

సమంతకు అరుదైన గౌరవం



నటి సమంతకు ఓ అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) ఉత్సవం అవార్డ్స్ కార్యక్రమం ఈ నెల 27న దుబాయ్‌లో జరగనుంది. కార్యక్రమంలో ఆమెను 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో సన్మానించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. "ఈ తరానికి చెందిన ఉత్తమ నటుల్లో సమంత ఒకరు. తన వైవిధ్యమైన పాత్రలతో అభిమానులను నిరంతరం ఆకట్టుకునే ఆమెకు ఈ అవార్డును అందజేయటం ఆనందంగా ఉంది" అని ఐఫా నిర్వాహకులు తెలిపారు. "ఐఫా ఉత్సవం నాకెల్లప్పుడూ ప్రత్యేకమే. దక్షిణాది సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు తెలియజెప్పే ఈ వేదికపై పాల్గొనడానికి నేను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని సమంత పేర్కొన్నారు.

150 మంది ఫైటర్లు... 300 మంది జూనియర్స్



నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ప్యాక్ట్ ఎంటర్‌టైనర్‌ను అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ డైరెక్టర్ పీటర్ హెయిన్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తున్నారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ చిత్రీకరణలో 150 మంది ఫైటర్లు, 300 మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. సినిమాకు ఈ యాక్షన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు చెప్పారు. విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రాఘవ లారెన్స్ 25వ సినిమా



'రాక్షసుడు', 'ఖిలాడీ' చిత్రాల తర్వాత నిర్మాత కోనేరు సత్యనారాయణ మరో భారీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యాక్షన్, అడ్వెంచర్ అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించనున్నారు. ఇది ఆయనకు 25వ సినిమా కావడం గమనార్హం. ప్యాన్ ఇండియా రేంజ్‌లో తెర కెక్కనున్న ఈ సినిమాకు రమేశ్ వర్మ దర్శకుడు. ఆయనతో కోనేరు సత్యనారాయణ తీస్తున్న మూడో చిత్రం ఇది. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సినిమా గురించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

దేవర సినిమాను కలసి చూద్దాం

అభిమానికి ఎన్టీఆర్ వీడియో కాల్





బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అభిమాని కౌశిక్‌ను జూనియర్ ఎన్టీఆర్ శనివారం పరామర్శించారు. కౌశిక్ బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆ అభిమానితో దాదాపు 10 నిమిషాలు ఎన్టీఆర్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. "నువ్వు నవ్వుతుంటే చాలా బాగున్నావు. ధైర్యంగా ఉండు. ట్రీట్‌మెంట్ తీసుకుని కోలుకో. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి. త్వరలోనే కలుద్దాం. 'దేవర' సినిమాను ఇద్దరం కలసి చూద్దాం. ట్రీట్‌మెంట్ ఖర్చులకు సాయపడతాను" అని ఎన్టీఆర్ భరోసా ఇచ్చారు. అలాగే కౌశిక్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆ వీడియో కాల్‌లో కౌశిక్ మాట్లాడుతూ "అన్నా. మిమ్మల్ని అస్సలు అనుకోలేదు" అని అన్నారు. దానికి బదులుగా ఎన్టీఆర్ "భలే వాడివే. నీతో మాట్లాడకుంటే ఎలా" అని అన్నారు. ఇటీవలే కౌశిక్ తల్లి ఓ వీడియో ద్వారా కుమారుడి ఆరోగ్య పరిస్థితి, జూనియర్ ఎన్టీఆర్ పట్ల తన కుమారుడికి ఉన్న అభిమానాన్ని తెలిపారు. దీంతో స్పందించిన జూనియర్ ఎన్టీఆర్, తిరుపతికి చెందిన తమ అభిమాన సంఘం కన్వీనర్ కృష్ణయాదవ్‌ను బెంగళూరుకు పంపించారు. తనతో మాట్లాడించాలని సూచించారు. దీంతో కృష్ణయాదవ్‌తో పాటు అభిమానసంఘం కన్వీనర్‌లు మాణిక్యం, బసవ కిద్వాయ్ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

విజయ్‌కి ఇదే ఆఖరి చిత్రమా?



అగ్రహీరో విజయ్ నటించే తదుపరి చిత్రాన్ని శనివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించారు. 'విజయ్69' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. మరో అగ్రహీరో అజిత్ కుమార్‌కు 'నెర్కొండ పార్వై' 'వలిమై', 'తుణివు' వంటి వరుస హిట్ చిత్రాలను అందించిన హెచ్.వినోద్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చే ఈ సినిమాలో పూజా హెగ్డే, సిమ్రాన్, మమిత బైజులను ఎంపిక చేయగా, విలన్ పాత్రను బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పోషిస్తున్నారు. కెమెరా: సత్యన్ సూరియన్. ఈ చిత్రానికి సంబంధించి విడుదల చేసిన పోస్టరులో 'త్వరలోనే ప్రజాస్వామ్యానికి వెలుగు చూపే వ్యక్తి రాక.' అంటూ ఆంగ్లంలో రాయగా, ఒక చేతితో టార్చిను పట్టుకుని కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రం తర్వాత విజయ్ సినిమాలకు స్వస్తి చెప్పి.. పూర్తిస్థాయిలో క్రియాశీలక రాజకీయాల్లో నిమగ్నం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే ఆయన 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

యుద్ధం నేపథ్యంలో ప్రేమకథ





సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. జనవరిలో సినిమాను మేకర్స్ ప్రకటించిన మేకర్స్.. వచ్చే ఏడాది క్రిస్మస్‌కు సినిమాను విడుదల చేస్తున్నట్లు మొదట తెలిపారు. అయితే, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని మార్చారు. 2026లో మార్చి 20న రంజాన్ సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ ఎపిక్ లవ్ డ్రామా కథేంటేంటన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సినిమా కథను మేకర్స్ ప్రకటించకున్నా.. ఇది యుద్ధం నేపథ్యంలో జరిగే ప్రేమకథ అని టాక్ వినిపిస్తోంది. అదే రోజున షారుక్ ఖాన్ నటించిన క్రైమ్ డ్రామా 'కింగ్' సినిమా విడుదలవుతోంది. కాగా, సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలోనే 'సావరియా' చిత్రంతో రణబీర్ సినీ రంగ ప్రవేశం చేశారు.

విడుదలకు ముందే అరవై అవార్డులు

ఇన్ ప్రోగ్రెస్



హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఫియర్'. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకురాలు హరిత గోగినేని రూపొందిస్తున్నారు. సుజాత రెడ్డితో కలసి ఏ.ఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అరవైకి పైగా అవార్డులు పొంది సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. 'ఫియర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు ప్రభు దేవా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. త్వరలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

కమ్ బ్యాక్ ఫిల్మ్



'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి', 'అన్నయ్య', 'ప్రేమ కోసం', 'శివరామరాజు' తదితరులు చిత్రాల్లో నటించిన హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'హరుడు'. హెబ్బా పటేల్, సలోని, నటషా, అలీ ఇతర ముఖ్య పాత్రధారులు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు చెప్పారు. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

కౌన్ బనేగా కరోడ్‌పతిలో.. పవన్‌పై ప్రశ్న



పవన్‌కల్యాణ్‌కు ఇండియా వైడ్ ఉన్న క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయం మరోసారి రుజువైంది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీజన్ 16కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న అమితాబ్ బచ్చన్.. కంటెస్టెంట్‌ను ఓ ఆసక్తికర ప్రశ్నను అడిగారు.. జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా భాధ్యతలు స్వీకరించిన వ్యక్తి ఎవరు? అని. ఇందుకు కంటెస్టెంట్ ఆడియన్స్ పోల్ ఎంచుకున్నారు. ఆడియన్స్‌లో 50శాతం మంది పవన్ అని జవాబు చెప్పారు. దీంతో ఈ సమాధానాన్ని లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ. లక్ష అరవై వేలు గెలుచుకుని మరో ప్రశ్నకు వెళ్లారు.

ఎంత గౌరవమో!



తెలుగుజాతి గర్వించదగ్గ నటుడు నందమూరి తారకరామారావు. చిత్ర పరిశ్రమలో తను ఎదుగుతూ మరెందరికో అవకాశాలు కల్పించి ఆదుకున్న మంచి వ్యక్తిగా ఎన్టీఆర్‌కు పేరుంది. అలా ఆయన ఆశీస్సులతో తన కెరీర్‌ను చక్కగా మలుచుకున్న పాత తరం హీరోల్లో కాంతారావు ఒకరు. తొలి సినిమా 'ప్రతిజ్ఞ' తర్వాత సరైన అవకాశాలు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోదామనుకున్న ఆయన్ని పిలిచి తన సొంత చిత్రం 'జయసింహ'లో తనతో సమానమైన పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. అలాగే 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడి పాత్ర కూడా ఎన్టీఆర్ గట్టి రికమండేషన్‌తోనే కాంతారావుకు దక్కింది. అలా ఎన్నోసార్లు తనని ఆదుకొన్న ఎన్టీఆర్ అంటే కాంతారావుకు ఎంతో అభిమానం, గౌరవం. కాంతారావు సొంత సినిమా పూజా కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరైన అరుదైన దృశ్యం ఇది. ఇందులో హీరోయిన్ జయంతి కూడా ఉన్నారు.





రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం వైద్యాధికారి ఎస్.వెంకటేష్ నేతృత్వంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటలవరకు నిర్వహించిన ఈ శిబిరంలో కంటి ఆపరేషన్లు అవసరమయ్యే వారికి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

అంబేడ్కర్ కంచు విగ్రహం ఏర్పాటు చేయాలి

రాజాం: పాలకొండ రోడ్డులో అంబేడ్కర్ కూడలి వద్ద ఉన్న ప్రస్తుత విగ్రహ స్థానంలో కంచు విగ్రహం ఏర్పాటు చేయాలని సమతా సైనిక్ దళ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కోండ్రు మురళిని శనివారం కోరారు. రాజాం పురపాలక సంఘం పరిధిలోని అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణం చేపట్టడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సమతా సైనిక్ దళ్ సంఘం తరఫున కోండ్రుకు చిరు సత్కారం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సానుకూలంగా స్పందించారు.

డీ వార్మింగ్ డే పోస్టర్ విడుదల

కొత్తవలస: నులిపురుగుల వలన కడుపునొప్పి ఆకలి మందగించడం, రకత హీనత వంటి సమస్యలు వస్తాయని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధి గోపాలకృష్ణ తెలిపారు.ఈనెల 17 వతేదిన జాతీయ నులిపురుగులు నివారణా దినోత్సవం సందర్భంగా డీ వార్మింగ్ డే పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. గర్భిణులు, బాలింతలు ఈ మాత్రలు వేసుకోరాదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** జాతీయ నులి పురుగుల నియంత్ర ణ దినం సందర్భంగా బూరాడ పీహెచ్‌సీలోని 13 సచివాలయాల పరిధిలో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారులు ఎస్.చలమయ్య, డా.రీనాచౌదరిలు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఎంఈవో వరప్రసాదరావు, ఎంపీహెచ్ఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని కొళాయిలు

రేగిడి: కొండల మామిడివలసలో ఇంటింటి కొళాయిలు గత వారం రోజులుగా పని చేయడం లేదు. గ్రామ సమీపంలో పైప్‌లైన్లు పాడవడంతో నీటి సరఫరా నిలిచిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఎస్సీ కాలనీలో 70, బీసీ కాలనీలో 35 ఇళ్లకు మంచినీరు రాక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరమ్మతులు చేపట్టినా.. ఒక గంట వ్యవధిలో మళ్లీ నీటి సరఫరా నిలిచిపోయిందని ఈసరి కుమారి, ఈసరి పుష్పరాణి, సూరమ్మ తదతరులు చెబుతున్నారు. దీనిపై ఏఈ శ్రీచరణ్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. సమస్య తమ దృష్టికి వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

చెరువుల పరిరక్షణ తప్పనిసరి

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి కృషి అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం సమితి సభ్యులు భీశెట్టితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ నాలుగేళ్లుగా మరిశర్ల కృష్ణమూర్తినాయుడు అధ్యక్షతన మాయమైన చెరువులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జిల్లా ప్రజలు వాస్తవాలు గ్రహించకపోతే, విజయవాడ బుడమేరు తరహా సంఘటనలు ఈ ప్రాంతంలో సంభవించే ప్రమాదం ఉందన్నారు.

క్రీడలతో ఐక్యత సాధ్యం

రాజాం: క్రీడల ఐక్యతకు దోహదం చేస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు అన్నారు. శనివారం ఉపాధ్యాయులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయుడు బెవర శంకరరావు పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ పోటీలలో వంగర జట్టు ప్రథమ బహుమతి, రేగిడి జట్టు ద్వితీయ బహుమతి సాధించాయి.

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆటో

వేపాడ: జాకేరు గ్రామ సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు, బుద్ద అప్పలనాయుడు దంపతులు విద్యార్థుల కోసం ఆటో సౌకర్యం కల్పించారు. జాకేరు నుంచి సోంపురం గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలకు చదువుల కోసం సుమారు 30 మంది విద్యార్థులు నిత్యం కాలి నడకన వెళుతుంటారు. వీరి వెతలను గుర్తించిన పాఠశాల లెక్కల మాస్టారు రవిశంకర్, సీఆర్పీ రామప్రసాద్‌లు బుద్ద అప్పలనాయుడు దంపతుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆ దంపతులు ఆటోను ఏర్పాటు చేశారు. అప్పలనాయుడు దంపతుల ఔదార్యాన్ని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే మేలు

రామభద్రపురం: తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకం కాదని.. చికిత్సతోనే నివారణ సాధ్యమని విశాఖపట్టణం మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సుభద్ర అన్నారు. శనివారం ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు చిక్కాల స్వాతి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని, విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి నిర్వహించిన కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

● జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి ఎన్‌వీ రమణ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరోని ఎత్తివేసి ఎక్సైజ్‌శాఖను పునరుద్ధరిస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని జిల్లా ఎక్సైజ్ అధికారి ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఎన్‌వీ రమణ అన్నారు. సెబ్‌ను తీసేసి, ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణను హర్షిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2020 మే 15న ఎక్సైజ్‌శాఖను గత ప్రభుత్వం మార్చేసిందని, దీంతో ఎక్సైజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందని దీంతో ఎక్సైజ్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణకు సహాయ, సహకారాలు అందించిన జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తొమ్మిది మంది శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ డీవీజీ రాజు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు జగదీశ్వరరావు, హెచ్‌వీఎస్ ప్రసాద్, ఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల కోసం నేతాజీ మాజీ సైనికుల సంఘ సభ్యులు రూ.1,00,123 విరాళంగా అందజేశారు. ఈ చెక్కును సంఘ ప్రతినిధులు శనివారం కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు గుణాకర్, ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు. ● వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి స్థానికుల నుంచి సమకూర్చిన రూ.2,47,435 విరాళాన్ని ఎంఎల్‌ఏ పూసపాటి అదితి గజపతిరాజు అందించారు. దీనికి సంబంధించిన చెక్కును రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా కలెక్టర్ అంబేడ్కర్‌కు శనివారం ఆయన చాంబర్‌లో అందజేశారు.

● **బొబ్బిలి:** విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన నాయకులు రాయగడ జగదీశ్, జె.చంద్రశేఖర్ తదితరులు రూ.64 వేలు రాశంగా అందించారు. మణికంఠ బిల్డర్స్‌కు చెందిన పసుపురెడ్డి ప్రభాకరరావు, గండెం భాస్కరరావు, సంతపురి వాసులు రూ.50 వేలు అందజేశారు. చింతాడకు చెందిన జయప్రదీప్, కృష్ణంనాయుడులు రూ.45 వేలు అందించారు. రామభద్రపురం మండలం కొండపాలవలసకు చెందిన లంక శ్రీనివాసరావు, దుర్గారావులు కలిసి రూ.20 వేలు అందించారు. కళింగ వైశ్య సంఘం కిట్టి మహిళలు రూ.12 వేలు, రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి గంటి గోపాల కృష్ణశర్మ రూ. 10వేలు, ఎన్ఆర్ఐ ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనివాసన్ రూ.10 వేలు, బాడంగి మండలం జీకేఆర్ పురానికి చెందిన చల్లా శ్రీనివాసరావు, బొబ్బిలి మండలం రాజుపేటకు చెందిన నాగిరెడ్డి రామారావు, కోరెడ్ల కృష్ణమూర్తి రూ.10 వేల చొప్పున విరాళాలను బేబీనాయనకు అందజేశారు.

● బొబ్బిలి పట్టణ హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్-అఖిల భారత మానవతా సందేశ సమితి (ఏఐఎంఎస్ఎస్ఎఫ్) రూ.27 వేలు, డాక్టర్ హరిప్రసాద్-డాక్టర్ స్వాతి రూ.25వేలు, బిల్డర్ రెడ్డి రమేష్ రూ.20 వేల చొప్పున విరాళాలను అందజేశారు. ● కొప్పల వెలమ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లచ్చుపతుల జగన్నాథం, కోరెడ్ల చిన అప్పలస్వామి రూ. లక్ష, పూల్‌బాగ్-అప్పయ్యపేట పెద్దలు రూ.1.45 లక్షలు అందించారు. వాడాడ పెద్దలు రూ.1.28 లక్షలు, రామభద్రపురం మాజీ వైస్ ఎంపీపీ, జిల్లా పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు రూ.50 వేలు, మడక రామారావు రూ. 20 వేలు, మండల పార్టీ అధ్యక్షుడు కరణం బాస్కరరావు రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. జన్నివలస పెద్దలు రూ.69,300, దుప్పలపూడి వాసులు రూ.50 వేలు, నాయుడువలస పెద్దలు రూ.40 వేలు, మిర్తివలస నుంచి రూ. 18,500, సోంపురం సర్పంచ్ చొక్కాపు అప్పలనాయుడు రూ.20 వేలు చొప్పున విరాళాలను ఎమ్మెల్యే బేబీనాయనకు అందజేశారు. ● **రాజాం:** వరద బాధితులకు ఆపద్బాంధవుడు సీఎం నారా చంద్రబాబునాయుడు అని.. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం టీడీపీతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు శ్యాంపురం పార్టీ కార్యాలయ ఆవరణలో వరద బాధితులకు రూ.5 లక్షల వరకు విరాళాలను కోండ్రుకు అందజేశారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే


భజనలో పాల్గొన్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట గ్రామంలో అర్జునస్వామి ఆధ్వర్యంలో శనివారం ఏకాహం కార్యక్రమం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు ఏకదాటిగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరై భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది భక్తులు హాజయ్యారు. పల్లెల్లో భక్తిభావం చాటేందుకు అర్జునస్వామి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని రామాలయాల్లో కీర్తనలు, భజనలు జే స్తూ హిందూధర్మాన్ని కాపాడుతున్నారని తెలిపారు.

కార్మికులకు భద్రత కల్పించాలి



పారిశ్రామికవాడలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

విజయనగరం దాసన్నపేట: పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రత కల్పించాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరం పారిశ్రామికవాడలో ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అచ్యుతాపురం, పరవాడలోని ఎసెన్షియా, సినర్జిన్ ఫార్మా కంపెనీల్లో కార్మికులు మృత్యువాత పడ్డారని, తీవ్ర గాయాల పాలయ్యారని గుర్తు చేశారు. దీంతో కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదనేది తేటతెల్లమైందన్నారు. తక్షణమే కార్మికులకు భద్రత కల్పించాలని, ఫార్మా కంపెనీల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు శంకరరావు, అప్పలరాజు, సోమరాజు, తిరుపతిరాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'రక్షణ కల్పించకపోతే బస్సులు నిలిపేస్తాం'

వేపాడ: విద్యార్థుల కోసం బడి బస్సులు నడిపే డ్రైవర్లపై మండలానికి చెందిన యువకులు దాడి చేసి గాయపరుస్తున్నారని.. తమకు రక్షణ కల్పించాలని ఎస్.కోట డిపోకు చెందిన డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే బస్సులను నిలిపివేస్తామని చెప్పారు. శుక్రవారం ఎస్.కోట డిపో బస్సులో పాఠశాలకు విద్యార్థులను తరలిస్తుండగా వేపాడ సమీపంలో యేసుదాసు, మరో ఇద్దరు యువకులు డ్రైవర్ కేదారి గణేష్‌పై మూకుమ్మడిగా దాడి చేశారని డ్రైవర్ల సంఘ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేపాడ మండలానికి వచ్చే డ్రైవర్లకు రక్షణ లేకపోతే బస్సులు నడిపేది లేదని వారు హెచ్చరించారు. డ్రైవర్‌పై జరిగిన దాడిపై వల్లంపూడి పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టకపోవడం ఘోరమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో బడి బస్సులు తిప్పలేమని డ్రైవర్ల సంఘ నాయకులు నాయుడు, గణేష్, వెంకటేష్, గురునాథ్, జీఎన్‌రాజు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

కోడూరు మాత యాత్రకు పోటెత్తిన భక్తులు


భక్తులకు వచనం వినిపిస్తున్న ఫాదర్స్, హాజరైన భక్తులు

బాడంగి: కోడూరు మాత యాత్ర ఏటా సెప్టెంబరు 2వ శనివారం జరుగుతుంది. తాజాగా శనివారం జరిగిన యాత్రకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. విశాఖ నుంచి వచ్చిన ఫాదర్స్ భక్తులకు కోడూరు మాత్ర సందేశం వివరించారు. శ్రీకాకుళం, విశాఖపట్టణం, ఒడిశా, నుంచి భక్తులు అధికంగా వచ్చారు.

రాజీయే రాజమార్గం

విజయనగరం టౌన్, సెప్టెంబరు 14: రాజీయే రాజమార్గమని, కేసులను సామరస్యంగా, స్నేహపూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కోర్టుల వద్ద శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు వద్ద నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లతో కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా, వారి జీవితాల్లో మనశ్శాంతి లభిస్తుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు శాశ్వతంగా పరిష్కారమవుతాయన్నారు. రాజీపడతగ్గ కేసులు ఇరుపార్టీల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే విజయనగరంలో 1806, పార్వతీపురంలో 410, బొబ్బిలిలో 762, సాలూరులో 587, ఎస్.కోటలో 416, గజపతినగరంలో 634, చీపురుపల్లిలో 569, కొత్తవలసలో 263, కురుపాంలో 44 కేసులు, మొత్తంగా 5491 కేసులు పరిష్కారమయ్యాయని, 10600 మంది కక్షిదా రులకు ప్రయోజనం చేకూరిందని అన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

బొబ్బిలి: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం ఏపీటీఎఫ్ 20వ ప్రాంతీయ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అఖిల భారత విద్యా సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు వైసత్యం, రాష్ట్ర నేత ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సంఘ నేత రౌతు రామ్మూర్తి, సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు, ఉపాధ్యాయ ప్రగతి సంపాదకులు జి.సత్యనారాయణ, జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 40 మంది రిటైర్ట్ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని రైతులు త ప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని వ్యవ సాయాధికారి రవీంద్ర సూచించారు. శనివారం సంతగై రమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో పర్యటించి ఈ పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

స్కూటీ దొంగ.. దొరికాడు


స్కూటీని దొంగిలించి నడిపించుకుని వెళ్తున్న నిందితుడు

బొబ్బిలి, సెప్టెంబరు 14: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర శుక్రవారం ఉదయం పార్కింగ్ చేసి ఉంచిన స్కూటీని దొంగిలించి ఎంచక్కా నడిపించుకుంటూ పోయాడు ఓ నిందితుడు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

బొబ్బిలి మండలం ఎం.బూర్జివలస గ్రామానికి చెందిన కోల వాసు అనే మెకానిక్ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర స్కూటీని పార్క్ చేసి పని మీద వెళ్లాడు. ఇది గమనించిన దొంగ స్కూటీని దొంగిలించి అక్కడ నుంచి నడిపించుకుంటూ పట్టుకు పోయాడు. బైక్ తాళం పోయిందని చెప్పి పట్టణంలోని పలువురు మెకానిక్‌ల దగ్గరకు స్కూటీని దర్జాగా తీసుకెళ్లి లాక్ తీయమని కోరాడు. సెన్సార్ బైక్ కాబట్టి అలా కుదరదని మెకానిక్‌లు చెప్పడంతో పట్టణంలోని అన్ని చోట్లకు తిప్పిన తరువాత స్థానిక సాయినగర్ దగ్గర బైక్‌ను వదిలేశాడు. ఈ లోగా బైక్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ పుటేజీ సేకరించారు. బైక్‌ను దొంగలించిన వ్యక్తి పార్వతీపురం మండలం జమ్మడవలస గ్రామానికి చెందిన గొట్టాపు రామకృష్ణగా గుర్తించారు. వెంటనే అతడిని పట్టణంలో సంచరిస్తుండగా పోలీసులు పట్టుకుని ఆరా తీశారు. బైక్ చోరీ విషయాన్ని పూసగుచ్చినట్లు వివరించాడు. వ్యసనాలకు బానిసైన రామకృష్ణ చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డాడని, బైకులను దొంగిలించి అమ్మడం లేదా తాకట్టు పెట్టే ప్రయత్నంలో విఫలమయ్యాడని, చివరకు ఇలా తమకు పట్టుపడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుని అదుపులోకి తీసుకున్నామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

జియ్యమ్మవలస(కొమరాడ): కొమరాడ మండలంలోని పాత గుణానుపురం గ్రామంలో రచ్చబండపై వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కొమరాడ ఎస్ఐ నీలకంఠం ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు (34) గా గుర్తించారు. పార్వతీపురం సీఐ ఎస్.గోవిందరావు క్లూస్ టీంతో పాటు వచ్చి విచారణ చేశారు. మృతదేహాన్ని పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

సంతకవిటి: కుమార్తె కనిపించడం లేదని మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం రాత్రి సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమార్తెకు పెళ్లి చెయ్యాలి అనే ఆలోచనతో సంబంధాలు వెతుకుతున్న క్రమంలో వివాహం చేసుకునేందుకు ఇష్టం లేని తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంధుమిత్రులు, స్నేహితులు ఇళ్లలో వెతికినా ఫలితం లేదని ఫిర్యాదులో స్పష్టం చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జనసేన నేత తీరుపై ఫిర్యాదు చేస్తా

శృంగవరపుకోట: నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ వ్యవహరిస్తున్న తీరుపై డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తానని శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషికుమారి ఒక ప్రకటనలో తెలిపారు. చలానా కట్టకుండ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడమే కాకుండా రోజులు గడుస్తున్నా తొలగించలేదని, ఇప్పుడు చలానా కట్టి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకునేందుకు వాటిని తొలగిస్తే మహిళనని చూడకుండా గౌరవం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. నీఅంతు చూస్తా, నీసంగతి చెబుతానని బెదిరిస్తున్నారన్నారు. పంచాయతీకి ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు ఫ్లెక్సీల ఏర్పాటుకు రుసుం వసూలు చేస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న పంచాయతీకి మద్దతు ఇవ్వకుండా రాద్ధంతం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న సత్యనారాయణ ఈవిధంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

మృతుని కుటుంబీకులకు పరామర్శ

బాడంగి: బాడంగి గ్రామానికి చెందిన కండి లక్ష్మణ ఇటీవల కొన్ని రోజుల క్రితం విశాఖపట్టణంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మణ మృతిపట్ల తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైసీపీ నాయకులు సంపయ్య, శ్రీను తదితరులు హాజరయ్యారు.

రక్తహీనతపై అవగాహన

వేపాడ: వేపాడ అంగన్‌వాడీ 1, 2, 3 కేంద్రాల పరిదిలో కిశోర్ బాలికలకు రక్తహీనతపై శనివారం అవగాహన కల్పించారు. పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పిల్లలకు, కిశోర బాలికలకు కార్యకర్తలు మంగలక్ష్మి, దేవి, రాజీలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు నెలసరి సమయంలో పరిశుభ్రతను పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తదితరులున్నారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
రీజనల్ ఆఫీస్, హెచ్.నెం.1435-27-112, మొదటి అంతస్తు, బైపాస్ రోడ్డు, సాయిరామ్ కాలేజ్ ఎదురుగా, పార్వతీపురం-535501.
ఇ-మెయిల్ : rmparvathipuram@apgvb.in

బంగారు ఆభరణముల వేలము ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఈ క్రింది తెలిపిన ఖాతాదారులు ఈ క్రింది బ్రాంచ్‌ల నందు ఆభరణములు తాకట్టుపై ఋణం పొంది తిరిగి చెల్లించనందున తేది.24.09.2024 (మంగళవారం) సాయంత్రం 04.00 గం॥లకు బ్రాంచి ఆవరణలో వేలం వేయబడును. 1) వేలములో పాల్గొనదలచిన వారు రూ.10,000/- సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను. 2) పోటీదార్లు దబ్బు మొత్తము వెంటనే చెల్లించి ఆభరణములు తీసుకోవలెను. 3) ఆభరణములు వేలము సమయములో మాత్రమే తనిఖీ చేసుకోవలెను. ఇతర వివరములకు బ్రాంచి మేనేజరు గారిని సంప్రదించగలరు. నోటీసులు అందని యెడల ఈ ప్రకటననే చివరి నోటీసుగా పరిగణించవలెను. సరియైన విలువ రానిచో లేదా ఏ కారణం లేకుండా అయినా వేలం రద్దుచేయుటకు బ్రాంచి మేనేజర్ గారికి అధికారము కలదు.

ఖాతా నెం.లు	పేర్లు & చిరునామా	స్థూల బరువు
చినబోగిల బ్రాంచ్, ఫోన్: 8331010448		
73205563389 73224890520 73224892834 73218292278	పిల్లి సంధ్య, భర్త. సతీష్ కుమార్ పెదబోగిల, సీతానగరం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా-535546	44.90 గ్రా॥లు 46.79 గ్రా॥లు 20.69 గ్రా॥లు 17.50 గ్రా॥లు
చినమేరంగి బ్రాంచ్, ఫోన్: 8331010448		
73205911204	బోను గౌరి, భర్త. గంగరాజు జోగిరాజుపేట గ్రామం, జియమవలస మండలం, పార్వతీపురం మన్యం జిల్లా-535526	19.05 గ్రా॥లు
పొగిరి బ్రాంచ్, ఫోన్: 8331011465		
73219535754	వాండ్రింకి జానకీ, భర్త. హరిబాబు పొగిరి గ్రామం, రాజాం, విజయనగరం-532148	23.46 గ్రా॥లు
సంతకవిటి బ్రాంచ్, ఫోన్: 9490157014		
73205539991	వంకల తవుడు, తండ్రి. వెంకట నరసయ్య, కృష్ణంవలస గ్రామం, సంతకవిటి, విజయనగరం-532123	24.82 గ్రా॥లు

తేది : 13.09.2024 సం/- బ్రాంచ్ మేనేజర్

మిస్సెస్ పర్‌ఫెక్ట్

● ప్రతి ఇంటా ఆమె నిర్ణయమే కీలకం
● భార్య మనసు తెలిసి మసలుకుంటేనే సంతోషం
● నేడు భార్యను ప్రశంసించే రోజు

(రాజాం రూరల్)

మగువకు రెండే రెండు ప్రపంచాలు.. పెళ్లికి ముందు అమ్మ, నాన్న, తమ్ముడు, చెల్లి, చదువు, గౌరవ మర్యాదలు నేర్చుకోవడం. పెళ్లి తరువాత భర్త, పిల్లలు, అత్తమామలు, సంసారం, సమాజంలో గుర్తింపు. ఇవే లోకంగా బతుకుతారు. ఈ క్రమంలో ఆమెను భర్త అర్థం చేసుకుని నడుచుకుంటే, ఆప్యాయతను పంచితే ఆ ఇంట ఆనందాల హరివిల్లే. ఈనెల 15న భార్యను ప్రసంశించే రోజు సందర్భంగా ప్రత్యేక కథనం..

తనింట్లో ఓ ఆర్థికవేత్త ఉందని చాలామంది మగాళ్లకు తెలియదు..ఓ రాజకీయ నిపుణురాలు ఉన్నట్ల అస్సలు గ్రహించరు.. భార్యను చిన్న చూపు చూస్తారు. నీకేం తెలియదులే అంటూ తక్కువ చేస్తారు. ఆమె ఆలోచనలకు విలువ ఇవ్వరు. భార్యను సలహా అడగడానికి చిన్నతనంగా భావించే భర్తలెందరో.. మహిళల మెదడు, ఆలోచనలు పురుషులకు భిన్నంగా ఉంటాయి. వారు సహజ ప్రేమ, ఆప్యాయతలను ఇష్టపడతారు. భర్త నుంచి నిత్యం వారు అవే కోరుకుంటారు. ఆమెకు గుర్తింపునిచ్చి సలహాలు స్వీకరిస్తే ఆ ఇళ్ల ఆనందాల హరివిల్లే..

● యోగ క్షేమాలు విచారించాలి

క్షణం తీరిక లేకుండా మహిళలు గడుపుతుంటారు. ఇదే సందర్భంలో అనారోగ్యానికి గురైన మహిళలు కోకొల్లలు. వీటిని పట్టించుకోని మగ మహారాజులూ లేకపోలేదు. ఉదయం లేచింది మొదలు రాత్రివరకూ ఆమె చేస్తున్న పనులు అన్నీ ఇన్నీ కావు. సందర్భానుసారం ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటే పడ్డ కష్టమంతా క్షణాల్లో మరచిపోవడం మహిళల బలహీనత. ఆమె జీవితంలో ముఖ్యమైన రోజుల్ని గుర్తుంచుకుని శుభాకాంక్షలు చెప్పగలిగితే ఆమె ఆనందానికి అవధులే ఉండవు

● వ్యక్తిగత స్వేచ్ఛను హరించొద్దు

మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను హరించకూడదు. పెళ్లైన తరువాత మహిళలు తన పుట్టింటి కంటే అత్తింటికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఆమెకు స్వేచ్ఛ ఇవ్వాలి. తనకు సంబంధించిన వారు వచ్చినపుడు వారికి కూడా తగిన గుర్తింపునివ్వాలి. తద్వారా భార్య మనసు దోచుకోవచ్చును.

● విహారంతో ఊరట

వారానికోమారు భార్యను బయటకు తీసుకువెళ్తే ఎంతో మేలు. ఎంత పనిఒత్తిడిలో ఉన్నా ఖచ్చితంగా ఆమెకు కొంత సమయాన్ని కేటాయించా లి. ఉద్యోగస్థురాలైనా సరే భర్తతో బయటకు వెళ్లాలని ఆశిస్తారే తప్ప ఒంటరిగా తిరగాలని కోరుకోరనే విషయాన్ని గుర్తించాలి. ఇలా చేయడం వల్ల వారం అంతా పడిన కష్టం మహిళలు ఇట్టే మరచిపోతారు.

● సగం..సగం..

అన్నింటా సగం సగంలా ఉండేందుకు అవకాశాలు కల్పించుకోవాలి. పెళ్లి నాటి నుంచే భార్యాభర్తలిద్దరూ ఓ ప్రణాళికతో ముందుకు సాగాలి. చిన్నపాటి వివాదాలు గాలివానగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇద్దరిపైనా ఉంది. అపార్థాలకు ఆస్కారం ఇవ్వకుండా జీవితాన్ని మలుచుకోవాలి.

● ఆర్థిక విషయాల్లో స్వేచ్ఛ

ఆర్థిక విషయాలే చాలా కుటుంబాల్లో కలతలకు కారణం. పొదుపుగా కుటుంబాన్ని చక్కదిద్దడంలో అతివలే కీలకం అనే విషయాన్ని పురుషులు తెలుసుకోని పరిస్థితి. ఆర్థిక విషయాలలో ఆమెకు కాస్త స్వేచ్ఛనివ్వాలి. ఇంటికి కావాల్సిన సరుకులు, కూరగాయలు మొదలుకొని అన్నింటా పొదుపు మంత్రం మహిళలే పాటిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.



● సహకరిస్తే ఉత్సాహం రెట్టింపు

భర్త నుంచి నిరంతరం ప్రేమ కావాలని భార్య కోరుకోవడం దురాశేం కాదని భర్తలు గుర్తించాలి. తానేం చేసినా ప్రోత్సాహంగా వ్యవహరిస్తే మరింత ఉత్సాహంతో మహిళలు ముందడుగు వేస్తారని గ్రహించగలగాలి. భర్త ప్రోత్సాహంతో అభివృద్ధి దిశగా పయనం సాగించిన మహిళామణులెందరో.. స్వతహాగా చేసుకునే శక్తి ఉన్నా భర్త కాస్త తోడుగా ఉంటే చాలు.

ఇవి కూడా చదవండి..

● భర్తను అమితంగా ప్రేమించే భార్యలూ లేకపోలేదు. అన్ని విషయాలు వారికి చెప్పలేక లోలోన మదనపడే మగువలకూ లోటులేదు. ● ప్రస్తుత సమాజంలో మద్యపానం కల్చర్‌గా మారింది. అయినా సర్దుకుపోయే భార్యలు ఉంటారు. అతిగా తాగొస్తే భర్తపై కోపంగా ఉండేవారే ఎక్కువ. ● సమయపాలన అన్నిసార్లూ సాధ్యం కాకపోయినా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సమయానికి ఇంటికి రాని భర్తంటే భార్యలకు మహా చిరాకు. ● ఇల్లు చూసి ఇల్లాలిని చూడమంటారు. ఇళ్లంతా శుభ్రంగా ఉంచాలని ఆమె కోరుకుంటే.. అందుకు విరుద్ధంగా కొందరు భర్తలు వ్యవహరించడాన్ని వారు అంతగా జీర్ణించుకోలేరు.

● ఇంట్లో ఉన్నపుడు కూడా భార్య పిల్లలకు దూరంగా ఉంటూ సెల్‌ఫోన్‌తో గడిపే భర్తలపై తాజాగా భార్యలు చిరాకు పడుతున్నారట.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక వంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకో చంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

LAND FOR SALE
★ రణస్థలం to నెల్లిమర్ల మెయిన్ రోడ్డుకి 1 కి.మీ. 2వ బిట్టు 33 సెంట్లు E/N/F 30ft./20ft. Road Nr. AP మోడరన్ జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ హాస్పిటల్ & 2 రోడ్ కార్నర్. డెవలప్ ఏరియా. సంప్రః 8309494629, 9885180930
AJV_204559

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

ప్రజాదర్బారుకు స్పందన



సమస్యలు వింటున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం సాలూరులోని తన స్వగృహంలో ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ దర్బారుకు అనూహ్య స్పందన లభించింది. పెద్దసంఖ్యలో వచ్చి ఆమెకు తన సమస్యలను విన్నవించుకున్నారు. కొన్ని సమస్యలపై ఆమె అప్పటికప్పుడే అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతిరావు, ముఖీ సూర్యనారాయణ, కనకల బాలాజీ, డబ్బి కృష్ణ, కనక తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి రైస్ మిల్లర్ల సమస్యలు



ముఖ్యమంత్రితో రామ్‌మోహనరావు తదితరులు

గరుగుబిల్లి: జిల్లాలోని రైస్ మిల్లర్ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని జిల్లా మిల్లర్ల సంఘ అధ్యక్షుడు బూరాడ రామ్‌మోహన రావు శనివారం తెలిపారు. అమరావతిలోని సీఎంను కలిసి, సమస్యలను వివరించామని స్థానిక విలేకర్లకు చెప్పారు. మిల్లులకు ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల మేర బకాయిలు రావాల్సి ఉందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లింగ్ చేసిన తదుపరి 67 కిలోల మేర బియ్యం అందించాల్సి ఉందని తెలిపారు. ఇలా అనేక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా, ఆయన సంబంధిత మంత్రులు, అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పలువురు ప్రతినిధులు ఉన్నారు.

వరద బాధితులకు నెల వేతనం

గరుగుబిల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నెల వేతనాన్ని అందించేందుకు మండలంలోని ఎంపీటీసీ సభ్యులు అంగీకరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు సమక్షంలో నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ ప్రతిపాదన మేరకు ఒక నెల వేతనాన్ని సహాయార్థంగా అందించేందుకు ఎంపీటీసీ సభ్యులు అంగీకారం తెలిపారు. గ్రామస్థాయిలో విరాళాలు సేకరించి ముఖ్యమంత్రికి అందించనున్నట్టు సత్యనారాయణ, రావివలస ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు తెలిపారు. ప్రభుత్వ శాఖల సిబ్బంది తమవంతు సహకారం అందించాలని కోరారు.

క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న జాకబ్ దయానంద్

పాలకొండ: నైపుణ్యమైన క్రీడాకారులను ఎంపిక చేయాలని స్పోర్ట్స్ స్కూల్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్ తెలిపారు. ఈనెల 19న సీతంపేట ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు మజ్జి రామకృష్ణ, మండల ఇన్‌చార్జి లిల్లీ పుష్పనాథం, ఎస్.ఉమామహేశ్వరరావు, ఆర్.రాములు, జి.శివరాంప్రసాద్, ఎస్.కళ్యాణ్‌కుమార్, వై.సురేష్‌కుమార్, వి.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న చందిలి పోలీసులు

ఒడిశా

రాయగడ: తర్లబడి గ్రామ సమీపంలో ఈనెల 9న జరిగిన దారి దోపిడీ కేసును చందిలి పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి పోలీసులు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కళ్యాణసింగుపూర్‌కు చెందిన సుకాంత్ కుమార్ భారత్ ఫైనాన్స్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈనెల 9న ఫైనాన్స్ కిస్తీలు వసూలు చేసేందుకు తమలబాయి, అలుబడి, తర్లబడి తదితర గ్రామాలకు వెళ్లి ఖాతాదారుల నుంచి కిస్తీలు వసూలు చేశారు. వసూలు అయిన డబ్బులు రూ.లక్షా 72 వేలను తీసుకుని బైకుపై వస్తుండగా తర్లబడి గ్రామ మార్గంలో నలుగురు వ్యక్తులు అడ్డగించారు. కత్తి, పిస్తోలు చూపించి సుకాంత్‌ను బెదిరించారు. అతని నుంచి నగదు, ఓ బైకు, ఒక ట్యాబ్ దోచుకుని ఉడాయించారు. దీంతో బాధితుడు సుకాంత్ చందిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.90వేల నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు. నిందితులు రాయగడ జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ, శిబశంకర్, కృష్ణ నాయక్‌లతో పాటు ఓ బలనేరస్థుడు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయగడ: సీపీఎం నేత ఏచూరి సీతారాం మృతికి రాయగడ మోటారు కార్మికుల సంఘం సంతాప సభ ఏర్పాటు చేసింది. స్థానిక మోటారు కార్మికుల సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు సునిల్ ఖోరో అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తొలుత సీతారాం చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు (కొండబాబు), మోటరు కార్మికుల సంఘం కార్యదర్శి వై.సాంబమూర్తి, ముచ్చి రమణ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణ అవసరం

రాయగడ: నేడు సమాజంలో మహిళలు, విద్యార్థినులు, చిన్నారులపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఆత్మరక్షణతో వాటిని ఎదుర్కోవాలని ప్రముఖ వైద్యురాలు సరస్వతి రాయ్ అన్నారు. శనివారం స్థానిక అటానమస్ కళాశాలలో ఆర్ట్స్, కామర్స్ సైన్స్ విద్యార్థినులకు ఆత్మరక్షణ స్వీయ బాధ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాయ్ మాట్లాడుతూ, ప్రతి ఆడపిల్లకు ఆత్మరక్షణ చాలా అవసరమని, ఎట్టి పరిస్థితుల్లో ధైర్యం కోల్పోకూడదని సూచించారు. విద్యార్థినులు ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలో చేసి చూపించారు. అనంతరం ముఖ్యఅతిథి చేతులమీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఏ.శ్రీనివాస్, సాయిమాధవి పాల్గొన్నారు.

రహదారుల తీరు మారేదెన్నడో?

- అధ్వాన్న దారుల్లో అవస్థలు పడుతున్న వాహనచోదకులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ఏళ్ల తరబడి ఇదే దుస్థితి

జిల్లాలోని పలు రహదారులు ఇప్పటికీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గోతులమయంగా.. రాళ్లు తేలి.. ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఈ దారుల తీరు మారడం లేదు. వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తమ అవస్థలు తీరేదెన్నడో.. ఈ దారులు తీరు మారేదెన్నడో.. అని వారు వాపోతున్నారు.

చెరువును తలిపించేలా..

జియ్యమ్మవలస (కొమరాడ): పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి వర్షం పడిందంటే చెరువును తలపిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూనేరు గ్రామం వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై ఉన్న గోతుల్లో నీరు చేరింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎప్పుడు వర్షం పడినా ఇక్కడ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించి, మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



అంతర్ రాష్ట్ర రహదారిపై గోతుల్లో నిలిచిన వర్షపు నీరు(ఫైల్)

కొమ్మలైనా తొలగించండి



రహదారి పైకి వ్యాపిస్తున్న చెట్ల కొమ్మలు

వీరఘట్టం: రహదారులను మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.. కనీసం రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలనైనా తొలగించరా.. అని వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నవగాం సెంటరు సమీపంలోగల పార్వతీపురం -పాలకొండ రహదారిలో చెట్ల కొమ్మలు ముందుకు వ్యాపిస్తున్నాయి. రాత్రి సమయంలో వాహన చోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఈ చెట్టు కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ దారిలో ప్రయాణం.. నరకం

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు బైపాస్ రహదారిలో పయనించాలంటే వాహనచోదకులు భయపడుతున్నారు. రహదారుల మరమ్మతులకు సంబంధించి గత వైసీపీ హయాం నుంచి ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో ఈ రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలోనైనా ఆర్అండ్‌బీ అధికారులు ఈ రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో బయట పడుతున్న రాళ్లు



వండువ, తలవరం మధ్య రహదారి దుస్థితి

గోతులమయం..

వీరఘట్టం: మండలంలోని వండువ సెంటర్ నుంచి తలవరం సెంటర్ మధ్య రహదారి అధ్వానంగా మారింది. వీరఘట్టం నుంచి పాలకొండ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి అంతా గోతులమయంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఘనంగా హిందీ దివస్

సీతంపేట రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం పద్మశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌డబ్ల్యూవో పి.అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ ఐక్యత కోసం ప్రతిఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవాలని హెచ్ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. హిందీ ఉపాధ్యాయిని సులోచనారాణి, సంస్కృతిభాషా ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



పాలకొండ: మాట్లాడుతున్న హెచ్ఎం సూర్యనారాయణ



సీతంపేటరూరల్: విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

లప్పటిలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: లుంబేసు పంచాయతీ కొండశిఖర గ్రామం లప్పటిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజనుల నుంచి రక్తపూత నమూనాలు తీసి, ఆరోగ్య పరీక్షలు చేశారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని భద్రగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు గిరిజనులకు సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ జి.కేశవనాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏ రామకృష్ణ ఉన్నారు.

గర్భిణుల వసతిగృహం పరిశీలన



గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవి

సీతంపేట రూరల్: సీతంపేట వైటీసీలో ఏర్పాటుచేసిన గర్భిణుల వసతిగృహాన్ని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి శనివారం పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, పౌష్టికాహారం, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు ఆమె సూచించారు. అక్కడి నుంచి స్కిల్ కాలేజ్‌లో శిక్షణలు పొందుతున్న యువతతో మాట్లాడారు.

మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ

జియ్యమ్మవలస: గత రెండు రోజులుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అండర్-14, 17 స్కూల్ గేమ్స్‌లో వనజ టీడబ్ల్యూఏ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం అల్లు రవిప్రసాద్ శనివారం విలేకర్లతో మాట్లాడారు. అండర్-14 విభాగంలో ఖోఖోలో యు.వర్ధన్, కె.రవి, వాలీబాల్‌లో కె.రామయ్య, బి.గిరి మంచి ప్రతిభ కనబర్చారని చెప్పారు. అండర్-17 విభాగంలో కబడ్డీలో యు.ప్రభాష్, ఖోఖో విభాగంలో కె.వంశి, కె.నారాయణ, ఎం.రామ్‌చరణ్ మంచి ప్రతిభ కనపర్చారన్నారు. వీరు నియోజకవర్గ స్థాయికి ఎంపిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

స్థానికులకే ఇసుక విక్రయాలు



ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీటీ

భామిని: వరద కాలువలో సేకరిస్తున్న ఇసుకను పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోనే విక్రయిస్తామని డీటీ శేఖరం తెలిపారు. నేరడి బ్యారేజ్‌లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన శనివారం పరిశీలించారు. 670 మెట్రిక్ టన్నులు సేకరించినట్టు గుర్తించారు. అయితే వెయ్యి మెట్రిక్ టన్నులు సేకరించాక విక్రయాలు చేస్తామన్నారు. ఆయనతో పాటు ఎంఆర్ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పార్వతీపురంలో 'వందే భారత్' హాల్ట్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో వందే భారత్ హాల్ట్‌కు సంబంధించి శనివారం షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు దుర్గ్-విశాఖపట్నం వందేభారత్ పార్వతీపురంలో సాయంత్రం 4:36 గంటలకు చేరుకుని 4:38 గంటలకు బయల్దేరుతుంది. జిల్లాకేంద్రంలో వందేభారత్ హాల్ట్‌కు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే విజయచంద్ర శుక్రవారం రైల్వే సహాయ మంత్రి సోమన్నను కలిసి వినతిపత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఆయన కృషి ఫలించడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

17 నుంచి డీ వార్మింగ్ డే

గరుగుబిల్లి: మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి 25 వరకు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం (డీ వార్మింగ్ డే) నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు కేకే సాగర్‌వర్మ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ 400 గ్రాముల మాత్రలను వేయనున్నట్టు చెప్పారు. ఆల్బెండజోల్ మాత్రలు సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్నవారికి వేయనున్నట్లు తెలిపారు. సచివాలయాల పరిధిలోని సిబ్బందితో పాటు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు.

గొర్రె పందేలపై దాడి

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామ సమీపంలో శనివారం వేకువజామున గొర్రె పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్ఐ కళాధర్ తమ సిబ్బందితో మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో రెండు పొట్టేళ్లు, ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. వారి వద్దనున్న రూ.3,260 స్వాధీనం చేసుకున్నారు.

లోక్ అదాలత్‌లో 570 కేసులు రాజీ

సాలూరు రూరల్: జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సాలూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మనోవర్తి వంటి 570 కేసులను రాజీతో పరిష్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తాడ్డి తిరుపతిరావు, సీబీ శేఖర్, వేణుగోపాల్, సూర్యనారాయణ, లక్ష్మణరావు, మధు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

- ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు
- నిమజ్జనాలు.. లడ్డూ వేలాలు

పాలకొండ: పట్టణంలో టీచర్స్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుని మండపం ఆవరణలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నిమజ్జనం చేశారు. ● స్థానిక ఆంజనేయ కాలనీలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గార ఆనందరావు రూ.10వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే పట్టణంలోని సాయిదుర్గానగర్‌లో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటు వేశారు. అదే వీధికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బాబూరావు రూ.4,600కు లడ్డూ దక్కించుకున్నారు. ● **వీరఘట్టం:** పట్టణంలోని కూరుకుల వీధిలో శ్రీకృష్ణసేవా సంఘం ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా మహన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీరఘట్టం టీడీపీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, శ్రీకృష్ణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



లడ్డూ దక్కించుకున్న ఆనందరావు



పాలకొండ: అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



వీరఘట్టం: అన్నదానం చేస్తున్న దృశ్యం

సామూహిక కుంకుమ పూజలు



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పాలకొండ: పట్టణంలోని ఆంజనేయనగర్‌లో వెలిసిన కాశీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భాద్రపద మాసం ఏకాదశి సందర్భంగా శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారు రెండు వందల మంది మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చన చేశారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

